
సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 17 । జూన్ । 2024



బడి బాట పట్టని బాల్యం

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలనే సంకల్పం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. అనేక చోట్ల వీధి బాలలుగా కనిపిస్తున్నారు. - 8లో



నిమ్మతో ఆదాయం

పాత పద్ధతులకు స్వస్తి పలికి నిమ్మ సాగులో కొత్త ఒరవడికి శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారు. నియంత్రాల విధానంతో లాభాల బాట పడుతున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.580	రూ.640
రెండోరకం	రూ.410	రూ.540

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 751 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మంత్రి, కలెక్టర్ బక్రీద్ శుభాకాంక్షలు

రాయచోటి: మత సామరస్యానికి ప్రతీక అయిన అన్నమయ్య జిల్లా వాసులకు సకల శుభాలతోపాటు ఆయురారోగ్యాలు అందాలని, అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగ నిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అన్నారు. అలాగే రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్ ఖాన్ తదితరులు ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

హార్సిలీహిల్స్‌పై రద్దీ



అటవీ పార్కులో సందడి

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఆదివారం పర్యాటకుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు ప్రకృతి సందర్శనా ప్రాంతాల్లో సేద తీరారు. వ్యూపాయింట్ల నుంచి ప్రకృతి అందాలను తిలకించారు. అటవీ ప్రాంగణంలోని 165 ఏళ్ల మహానీలగిరి వృక్షాన్ని ఆసక్తిగా తిలకించి విశేషాలు తెలుసుకున్నారు. టూరిజం, అటవీ పార్కుల్లో చిన్నారులు ఆటలతో సందడి చేశారు.

నేడు ఆకాశవాణిలో ప్రత్యేక కార్యక్రమం

కడప కల్చరల్: ఆకాశవాణి కడప కేంద్రం ఈనెల 17వ తేదీ 62వ వసంతంలోకి అడుగు పెడుతోంది. ఈ నేపథ్యంలో రేడియోలో ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు కడప కేంద్రం ప్రోగ్రామ్‌హెడ్ చుండూరి మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు అనుభవాలు– అపూర్వ కార్యక్రమాల పేరుతో ఎస్. రవికుమార్‌రెడ్డి రచించిన కార్యక్రమం ప్రసారం కానుందన్నారు. ఇందులో వివిధ రంగాల ప్రముఖులతో పరిచయాలు, శ్రోతల మదిని దోచిన పలు అంశాలు ఉంటాయన్నారు. మీడియం వేవ్, ఎఫ్ఎం ద్వారానే కాకుండా శ్రోతలు న్యూస్ ఆన్ ఎయిర్ యాప్ ద్వారా కూడా ఈ కార్యక్రమాలను వినవచ్చని ఆయన తెలిపారు.

రేపు హాకీ జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో ఈనెల 18వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి హాకీ సీనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హాకీ కడప వైఎస్ఆర్ జిల్లా కార్యదర్శి ఎం. శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1995 జనవరి 1 తర్వాత పుట్టినవారు ఈ ఎంపికలకు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే వారు ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ హాకీ పోటీల్లో పాల్గొన్నాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, పుట్టినతేదీ ధృవీకరణ పత్రం, 10 మార్కులిస్టులతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 8688446515 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జూలై 1 నుంచి ఎల్ఎల్‌బీ రెగ్యులర్ సప్లిమెంటరీ పరీక్షలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని న్యాయ కళాశాలలో చదువుతున్న ఎల్ఎల్‌బీ (ఐదేళ్లు, మూడేళ్ల) విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు జులై 1వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎన్. ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఐదేళ్ల బీఏ, ఎల్ఎల్‌బి, మూడేళ్ల ఎల్ఎల్‌బీ (రెగ్యులర్) ఒకటో సెమిస్టర్ పరీక్షలు 1,3,5,8,10 తేదీల్లో జరుగుతాయన్నారు. అలానే 3, 5 ఏళ్ల ఎల్ఎల్‌బీ సప్లిమెంటరీ పరీక్షలు ఇదే తేదీలలో ఉంటాయన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం కేంద్రంగా జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు హాజరుకావాలని ఆయన కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్న దానానికి కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి అనుచరుడు పాలగిరి సుబ్బారెడ్డి రూ .1,00,116లు విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. సదరు మొత్తాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆలయ ప్రధాన ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి,రాజారమేష్,రాజ గోపాలాచార్యులకు అందజేశారని చెప్పారు. ఈసందర్భంగా దాత సుబ్బారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ షరీఫ్,ఇన్‌స్పెక్టర్ రవి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆణిముత్యం అందేనా?

- నగదు పురస్కారాల కోసం ప్రతిభావంతుల ఎదురుచూపు
- పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన వారికి గత ప్రభుత్వం 'ఆణిముత్యాలు' పేరుతో సత్కారం
- పదోతరగతి టాపర్లకు రూ.లక్ష బహుమతి ప్రదానం
- నియోజకవర్గ, జిల్లా స్థాయి విజేతలకు నగదు, ప్రోత్సాహకాలు
- ఈ ఏడాది ఇంత వరకు అందని మార్గదర్శకాలు



గత ఏడాది ఆణిముత్యం కింద నగదు ప్రోత్సాహక బహుమతి అందుకుంటున్న మదనపల్లె వివేకానంద మున్సిపల్ విద్యార్థి (ఫైల్ ఫొటో)

మదనపల్లె సిటీ: ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడం.. ప్రభుత్వ బడుల్లో చదువుకునే ప్రతిభావంతులను ప్రోత్సహించి మిగిలిన విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు గత ప్రభుత్వం పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు 'ఆణిముత్యాలు' పేరిట నగదు ప్రోత్సాహకాలు అందించింది. ఈ పథకాన్ని ఏటా అమలు చేయనున్నట్లు ఆ సమయంలో స్పష్టం చేసింది. దీంతో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ ఏడాది కూడా నగదు ప్రోత్సాహకాలు అందుతాయని భావించారు. పదో తరగతి విద్యార్థులకు మాత్రమే కాకుండా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు సైతం గత ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేసింది. ప్రతి గ్రూపులో టాపర్లను ఎంపిక చేసి వారికి నగదు ప్రోత్సాహకాలతో సత్కరించింది. ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను, నగదు పురస్కారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ప్రభుత్వం ఘనంగా సత్కరించి గౌరవించింది. కొత్త ప్రభుత్వం కూడా అలా చేయాలని విద్యార్థి, ఉపాధ్యాయలోకం కోరుతోంది. ఆశగా ఎదురుచూస్తోంది.

జిల్లా, నియోజకవర్గ స్థాయిలోనూ...

విజేతలకు నగదు ప్రోత్సాహకాలు కేవలం రాష్ట్ర స్థాయికే పరిమితం చేయకుండా నియోజకవర్గ, జిల్లా స్థాయికి వర్తింపజేశారు. నియోజకవర్గ స్థాయిలో టాపర్లకు రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచినవారికి రూ. 5 వేలు అందజేశారు. జిల్లా స్థాయిలో టాపర్లకు రూ.50 వేలు, ద్వితీయ స్థానం రూ.30 వేలు, తృతీయస్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు అందించారు. ఈ రెండు స్థాయిల్లో కూడా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందాయి. కొన్ని ప్రాంతాల్లో దాతల సహకారంతో పాఠశాల స్థాయిలో టాపర్లకు ప్రథమ స్థానానికి రూ. 3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానానికి రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

గత ఏడాది ఆణిముత్యాల వివరాలు..

ఎంపికైన విద్యార్థులు: **909** మంది

పంపిణీ చేసిన నగదు ప్రోత్సాహకం: రూ.**18.14** లక్షలు

ఈ ఏడాది పది పరీక్షల ఫలితాల వివరాలు:

ఉత్తీర్ణత సాధించినవారు: **19,276** మంది

580 మార్కులుపైబడి సాధించిన వారు: **23** మంది విద్యార్థులు

ఇప్పటి వరకు అందని మార్గదర్శకాలు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అమలు చేసిన ఆ పథకానికి గత ఏడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి మంచి స్పందన లభించింది. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని, ఈ పథకాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగించాలని కోరారు. గత ఏడాది జూన్ 20 నాటికి అన్ని స్థాయిల్లో నగదు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమాలు పూర్తి చేశారు. ఈ ఏడాది విద్యార్థులకు ఇలాంటి నగదు పురస్కారం అందుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయంపై విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. జిల్లా విద్యాశాఖాధికారి నుంచి ఎలాంటి మార్గదర్శకాలు అందకపోవడంతో ఈ ఏడాది నగదు ప్రోత్సాహకాలు ఇస్తారా? లేదా? అన్న సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది.

'నేను బడికి పోతా'

- కొత్త కార్యక్రమానికి విద్యాశాఖ శ్రీకారం
- బడిఈడు పిల్లలను వందశాతం బడుల్లో చేర్పించడమే లక్ష్యం
- గ్రామ, మండల, జిల్లాస్థాయి కమిటీలు



కడప ఎడ్యుకేషన్: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం నేను బడికి పోతా అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలందరూ బడుల్లోనే ఉండాలి. డ్రాపౌట్ పిల్లలను తిరిగి బడుల్లో చేర్పించాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. సమగ్రశిక్ష ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు ఉత్తర్వులను జారీ చేశారు. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయల ఉద్యోగుల సహకారంతో డోర్ టు డోర్ తిరుగుతూ ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టనున్నారు. చదువుకుంటే కలిగే లాభాలను వివరిస్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాల గురించి పిల్లలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకోనున్నారు. వచ్చే నెల జులై 13వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్‌ను జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఇందులో జిల్లాస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులతో ప్రత్యేక కమిటీలను నియమించనున్నారు. ఆయా కమిటీ సభ్యులు వారికి అప్పగించిన పనులను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జులై 12న వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్లలోని పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉన్నారని అధికారికంగా ప్రకటించాల్సి ఉంటుంది.

జిల్లా కమిటీలో ఎవరెవరు ఉంటారంటే...

జిల్లా విద్యాశాఖ అధికారి చైర్మన్‌గా, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ (ఏపీసీ) మెంబర్ కన్వీనర్‌గా, డీపీఓ, లేబర్‌శాఖ డీసీ, ఐటీడీఏ పీఓ, ఐసీడీఎస్ పీఓ, ట్రైబల్, సోషల్,బీసీ, మైనార్టీ వెల్ఫేర్ డీడీలు, ఎన్‌సీఎల్‌పీ డీడీ, మెప్మా పీడీ, డీవైఈఓ, ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా ఉంటారు.

మండల కమిటీల్లో...

మండల విద్యాశాఖ అధికారి మెంబర్ కన్వీనర్, ఎంపీడీవో చైర్మన్‌గా తహసీల్దార్, ఐసీడీఎస్ సీడీపీఓ, సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఉర్దూ హెడ్‌మాస్టర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, డిఎల్ఎంటీలు సభ్యులుగా వ్యవహరించనున్నారు.

గ్రామ కమిటీల్లో...

పేరెంట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న వ్యక్తి గ్రామ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పాఠశాల హెచ్‌ఎం మెంబర్ కన్వీనర్‌గా, పంచాయతీ కార్యదర్శి సీఆర్పీ, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ వలంటీరు, అంగన్‌వాడీ ఉద్యోగి సభ్యులుగా ఉంటారు.

విజయవంతం చేయాలి



నేను బడికి పోతా కార్యక్రమం విజయవంతానికి అందరూ కృషి చేయాలి. ఆయా కమిటీల్లో ఉండే వారు బాధ్యతగా తీసుకుని షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం నిర్వహించాలి. – చల్లా విశ్వనాథరెడ్డి, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్, సమగ్రశిక్ష

పిల్లలను బడుల్లో చేర్పించాలి



ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలి. ఇందుకోసం కమిటీలను ఏర్పాటు చేస్తాం. కమిటీ సభ్యులుప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. – అనురాధ, వైఎస్ఆర్ జిల్లా విద్యాశాఖాధికారి

కార్యకర్తలకు ఎంపీ మిథున్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు



ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యకర్తలు

రాజంపేట రూరల్: రాజంపేట వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి నియోజకవర్గ కార్యకర్తలను ఆత్మీయంగా పలకరించి అభినందనలు తెలిపారు. స్థానిక ఆకేపాటి భవన్‌కు ఆదివారం విచ్చేసిన ఆయనకు, అలాగే ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డికి నియోజకవర్గంలోని కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఈ సందర్భంగా వారు భరోసా ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి తాము ఎప్పుడూ కట్టుబడి ఉంటామన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, నాయకులు చొప్పా యల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

త్యాగమయ జీవితం బక్రీద్ సందేశం

నేడు ఈద్–ఉల్–జుహా (బక్రీద్)

కడప కల్చరల్: ముస్లిం లోకం అల్లాహ్‌కు మించిన ప్రపంచం లేదని విశ్వసిస్తుంది. ఆయన మాటలను, దూతల ఆదేశాలను శాసనంగా భావించి పాటించేందుకు సిద్ధమవుతుంది. వారి పండుగల్లో బక్రీద్ ఒకటి. త్యాగమయ జీవితమే మానవ జన్మకు సార్థకమన్న అల్లాహ్ ఆదేశాలు పాటించేందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధం కావడమే ఈ పండుగ ఉద్దేశం. మానవాళికి మార్గదర్శకత్వం వహించడానికి దైవం పక్షాన అవతరించిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఐదు వేల సంవత్సరాల క్రితం జన్మించిన ఆయన 'దేవుడే సకల చరాచర సృష్టికి కారకుడని, ఆయన పట్ల భక్తి, శ్రద్ధలు ప్రకటించడం ద్వారా ముక్తిని పొందవచ్చు'నని జాతికి పిలుపునిచ్చారు. అలాగే ఈ పర్వదినం ప్రవక్త ఇబ్రహీం త్యాగనిరతి, సహనశీలత, రుజు వర్తనలను తెలుపుతుంది.



ప్రొద్దుటూరులో ప్రార్థనలకు సిద్ధంగా ఉన్న ఈద్గా మైదానం

- బక్రీద్ పండుగలో ఖుర్బానీకి ప్రాధాన్యత ఉంది. దీని వెనుక విశేషమైన కథనం కూడా ప్రచారంలో ఉంది. హజరత్ ఇబ్రహీం దైవం ఆదేశం మేరకు లేకలేక కలిగిన కన్నబిడ్డను ఖుర్బానీ ఇచ్చేందుకు సిద్ధపడతారు. నాటి ఆయన త్యాగమే నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ పండుగ సందర్భంగా ఆ సందేశాన్ని ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం లోకం అత్యంత పవిత్రంగా భావిస్తోంది. అల్లాహ్ ఆదేశాన్ని పాటించేందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధం కావాలని ఈ పండుగ ప్రబోధిస్తుంది.
- బక్రీద్ పండుగ సందర్భంగా బుధవారం నిర్వహించే సామూహిక ప్రార్థనల కోసం కడప నగరంలో మసీదులు, ఈద్గాలలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, మసీదు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కడప శివార్లలోని బిల్టప్, దండు తోపాటు ఇతర ఈద్గాలు, జిల్లాలోని వేలాది మసీదుల్లో సోమవారం ప్రార్థనల నిర్వహణకు ఇప్పటికేతగిన ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా కడప నగరంలోని బిల్టప్ ఈద్గా వద్ద ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. ఇబ్బందులు లేకుండా ప్రార్థనలు చేసుకునేందుకు ఈద్గా ప్రాంగణమంతా షామియానాలు ఏర్పాటు చేశారు. ప్రార్థనలు ముందు వజూ చేసుకునేందుకు మంచినీరు అందుబాటులో ఉంచారు. ప్రార్థనలు జరిగే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలను దారి మళ్లించనున్నారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘాటెక్కుతున్న ఉల్లి!

ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదంటారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లి నుంచి ఆ మేలు పొందే సంగతి అటుంచితే దాని మాట ఎత్తాలంటేనే భయమేస్తోంది. ఇందుకు కారణం ధరలు. పెరుగుతున్న ధరలతో కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

- ఉత్పత్తి తగ్గుదల
- 30 నుంచి 50 శాతం పెరగనున్న ధరలు
- కొనాలంటే కన్నీళ్లే..



ఉల్లి అరకొరనిల్వలు

రాజంపేట: ఉల్లిపాయల ధరలకు రెక్కలొచ్చాయి. మే నెలలో రూ.20 ఉన్న ధర జూన్‌లో 50కి చేరింది. పుణే, ఢిల్లీ, హైదరాబాద్, కర్నూలు నుంచి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల్లోని మార్కెట్లకు ఉల్లి(ఎర్రగడ్డ) పాయలు వస్తున్నాయి. ఉభయ జిల్లాల్లో తగినంత నిల్వలు లేకపోవడం, సరఫరా మందగించడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. దేశంలో ఉల్లిని ఉత్ప త్తి చేసే అగ్రగామి రాష్ట్రమైన మహారాష్ట్రలో కరువు పరిస్థితుల కారణంగా ఉత్పత్తి లోటు ఉంది. దీంతో దేశంలో గత రెండు వారాల్లో ఉల్లి ధరలు 30 నుంచి 50శాతం పెరిగాయి. ఈ క్రమంలోనే కొందరు వ్యాపారులు సరుకు నిల్వ చేసి ధరలు మరింతగా పెరిగేలా చేస్తున్నారనే ఆరోపణలు మార్కెట్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ధరల నియంత్రణకు కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకోవాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది.

నెలరోజుల వ్యవధిలో పెరిగిన ధరలు

ధరల విషయానికి వస్తే రీటైల్ ధర సుమారు 25 శాతం, హోల్‌సెల్ ధర 15శాతం పెరిగింది. ఏడాది క్రితం ఉల్లి రీటైల్ ధర కిలో రూ.20 ఉండగా, హోల్‌సెల్ క్వింటాల్‌కు రూ.1,581.97గా ఉంది. ప్రస్తుతం రీటైల్ ధర కిలో రూ.40 నుంచి రూ.50 మధ్య ఉంది. నెల క్రితం కిలో ధర రూ.20 నుంచి రూ.30 వరకు ఉంది. నెలరోజుల వ్యవధిలోనే ఉల్లి ధరలు భారీగా పెరిగాయి. జూన్ 17న బక్రీద్ నేపథ్యంలో ఉల్లిపాయలకు దేశీయంగా భారీ డిమాండ్ ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

కొత్త పంట చేతికి వచ్చే అవకాశాల్లేవు..

మరోవైపు సెప్టెంబర్, అక్టోబర్ వరకు కొత్త ఖరీఫ్ పంట చేతికి వచ్చే అవకాశం లేకపోవడంతో ఉల్లి కిలో రూ.60 దాటొచ్చని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. దేశంలో 42 శాతం మేర ఉల్లి ఉత్పత్తి జరిగే మహారాష్ట్రలో తీవ్రమైన కరవు పరిస్థితుల కారణంగా ఈ ఉత్పత్తి 15 నుంచి 20 శాతం తగ్గుదల చవిచూసింది. మహారాష్ట్రలోని 27 జిల్లాలు 20 నుంచి 45శాతం వరకు లోటు వర్షపాతాన్ని ఎదుర్కొన్నాయని గణంకాలు సూచిస్తున్నాయి.

- ఉల్లి ఉత్పత్తి పడిపోయిన క్రమంలో రానున్న రోజుల్లో కిలో ధర రూ.120 నుంచి రూ.150కి చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో అవసరమైనంత ఉత్పత్తి మార్కెట్‌కు రావడంలేదు. దీంతో ధర పైకి ఎగబాకుతోంది.కొత్తపంట మార్కెట్‌లోకి వచ్చేవరకు మరికొన్ని రోజులు ఉల్లి కొరత కొనసాగుతుందని రైతులు, హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

ఎంతో మేలు..



ఉల్లి వెనుక వెయ్యేళ్ల చరిత్రే ఉంది. భారతీయ వంటల్లో ఇది ముఖ్యమైన పదార్థం రక్తపోటు, గుండెజబ్బులు, ఆస్తమా, అలర్జీ, దగ్గు, జలుబు, నిద్రలేమి, ఊబకాయం లాంటి వ్యాధులు నివారణకు ఉల్లి దోహదపడుతుంది. ఉల్లికి అనేక పేర్లు ఉన్నాయి. సంస్కృతంలో పలాండు, హిందీలో ప్యాజ్, ఇంగ్లీషులో ఆనియన్, తెలుగులో ఉల్లి అని పిలుచుకుంటున్నారు.

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి




ఉల్లి ధరలను ముందుగానే అదుపు చేయాలి. పేద,మధ్య తర గతి ప్రజలకు ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే కిలో రూ.20 నుంచి రూ.50కి చేరుకుంది. ఇంకా పెరుగుతుందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. –జి.కృష్ణరావుయాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనరు,రాజంపేట

ఉల్లి ధరలను నియంత్రించాలి



ఉల్లి ధరలను నియంత్రించాలి.బక్రీద్‌పండుగ వస్తోంది. ఉల్లికి డిమాండ్ ఉంటుందంటున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్యతరగతి వారికి అందుబాటులో ఉండేలా ధరలను తీసుకురావాలి.ఆ దిశగా ఆలోచించాలి. –ఫైరోజ్‌ఖాన్‌లోడి, నందలూరు

ఉత్పత్తి తగ్గడమే కారణం



ఉత్పత్తి తగ్గిపోవడం ..దిగుమతులు కూడా అంతంత మాత్రంగా ఉండటమే ఉల్లి ధరలు పెరగడానికి కారణం.హోల్‌సేల్, రీటైల్ ధరలు దూసుకుపోతున్నాయి. రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. –కమాల్‌బాషా, ఉల్లి హోల్‌సేల్ వ్యాపారి, నందలూరు

పారదర్శక పాలన అందిస్తాం

- ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం చేస్తున్నాం
- మీడియాతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి: రాష్ట్రంలో పాలనను పారదర్శకంగా అందిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటిలోని మండిపల్లి భవన్‌లో మంత్రి మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై విచారణ జరిపి తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్షలు చేస్తున్నారన్నారు. అసైన్డ్ భూములపైన కూడా అర్హత కలిగిన రైతులందరికీ న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. యువజన విభాగాలలో కూడా ప్రత్యేక చొరవ చూపి తగిన రీతిలో ఉపాధి అవకాశాలను కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. క్రీడారంగాలలో రాణిస్తున్న వారికి తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన అనంతరం ఇచ్చిన హామీని అమలులోకి తెస్తామన్నారు. కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టును తమ ప్రభుత్వంలో నిర్మించి రైతులను ఆదుకుంటామన్నారు. మీడియా సమావేశంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పీటీఎం మండలం కందుకూరు పంచాయతీ అగ్రహారం గ్రామానికి చెందిన నరసింహులు కుమారుడు జె.శంకరప్ప(49) కుటుంబ సమస్యలతో శనివారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. అదే విధంగా ములకలచెరువు మండలం సోంపల్లి పంచాయతీ కొండేటివారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు డి.ప్రతాప్(23) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబసభ్యులు బాధితులను 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పది మంది పేకాట రాయుళ్ల అరెస్టు


మాట్లాడుతున్న సిద్దవటం ఎస్‌ఐ పెద్దఓబన్న

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలో పేకాడుతున్న పదిమందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,20,550 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ పేకాడుతున్నట్లు తమకు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరాలపై దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం ప్రాంతాల వారిని అరెస్టు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు రామకుమార్, రాఘవేంద్ర, రవి కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి


మృతి చెందిన హఫీజుల్లా (ఫైల్)

కలికిరి : మండలంలోని కలికిరి పట్టణానికి చెందిన టీ స్టాల్ హఫీజుల్లా అలియాస్ బుజ్జి(45) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. గత నెల 19న మదనపల్లి–పుంగనూరు రోడ్డు వద్ద ప్రమాదానికి గురై తమిళనాడు రాష్ట్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడక ఆదివారం రాత్రి మరణించాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కలికిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా బుజ్జి పనిచేశాడు.

వివాహిత ఆత్మహత్య

ఎర్రగుంట్ల : మండలంలోని పోట్లదుర్తి గ్రామానికి చెందిన వివాహిత పేర్ల శ్రావణి(20) తన భర్త, అత్త, ఆడబిడ్డల వేధింపులు తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని ఎర్రగుంట్ల ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. ప్రొద్దుటూరు మండలానికి చెందిన ఓబులరావు కుమార్తె శ్రావణిని పోట్లదుర్తి గ్రామానికి చెందిన వీర దిలీప్‌కు ఒక్కటిన్నర సంవత్సర కిందట ఇచ్చి వివాహం చేశారు. అయితే భర్త వీర దిలీఫ్ మద్యానికి బానిస అయ్యారు. దీనికి తోడు అత్త రమాదేవి, ఆడబిడ్డ మహేశ్వరి, భర్త వీరదిలీప్‌ల వేధింపులు అధికమవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని శ్రావణి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఓబులరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బడి బాట పట్టని బాల్యం

- తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధికారగణం
- కార్మికులుగా గుర్తిస్తే కేసులు పెడతామని హెచ్చరిక


భిక్షాటనం చేస్తున్న బాలుడు

రాయచోటి టౌన్ : అడుతూ పాడుతూ బడికి వెళ్లాల్సిన బాలలు వీధుల్లోనే కనిపిస్తున్నారు. కార్మిక శాఖ, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఏటా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేపట్టి చైతన్యం చేసినా.. తల్లిదండ్రులలో మార్పురావడం లేదు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలనే సంకల్పం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. బడి ఈడు పిల్లలు ఎక్కువగా జోలెపట్టి కనిపిస్తున్నారు. కన్న తల్లిదండ్రులే వారిని ప్రోత్సహించడం కనిపిస్తోంది. రాయచోటి పట్టణంలోని బస్టాండు సర్కిల్, గాంధీ బజార్, కంసల వీధి, బ్రాహ్మణ వీధి, ఆస్పత్రుల సముదాయాలలో బాలలు భిక్షాటన చేస్తూ ఎక్కువగా కనిపిస్తున్నారు. కొందరు పెద్దలు సైతం పసి బిడ్డలను అద్దెకు తీసుకొస్తున్నారనే వాదనలు వినిస్తున్నాయి. వీధి బాలలుగా మార్చేసి.. భావి భారత పౌరులను దారి మళ్లించి సమాజ వ్యతిరేక శక్తులుగా తయారు చేసినట్లేనని విద్యావేత్తలు చెబుతున్నారు.

కార్మికులుగా గుర్తిస్తే కేసులు పెడతాం

అధికారుల తనిఖీల్లో బాల కార్మికులను గుర్తిస్తే.. తల్లిదండ్రులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేస్తాం. షాపులలో పని చేయడం, గుమాస్తాలుగా చేయడం, తోపుడు బండ్లు, ఇతర ప్రాంతాల్లో వ్యాపార దుకాణాల్లో ఉండడం కనిపిస్తే యజమానులను అదుపులోకి తీసుకుంటాం. బాలల తల్లిదండ్రులను చైతన్యం చేసేందుకు శిశు సంక్షేమశాఖతో కలిసి అవగాహన ర్యాలీలు చేపడుతున్నాం.

\- అల్లాబకాష్, కార్మిక శాఖ అధికారి

అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలనే సంకల్పంతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వీధుల్లో కనిపించే వారిని అదుపులోకి తీసుకొని వారిని బడిలో చేర్పించే కార్యక్రమాన్ని చేపడతాం. ఈ నెలాఖరు వరకూ అవగాహన కార్యక్రమాలు చేపడతాం. తనిఖీలు నిర్వహించి పనుల్లో ఉన్న పిల్లలను అదుపులోకి తీసుకుని బడికి పంపే చర్యలు చేపడతాం.

\- శశికళ, ఐసీడీఎస్ ఇన్‌ఛార్జి పీడీ, అన్నమయ్య జిల్లా

ఆస్తిలో వాటా ఇవ్వలేదని ఆత్మహత్య


రామసముద్రంలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన నారాయణస్వామి

రామసముద్రం : ఆస్తిలో తన వాటా అన్నదమ్ములు ఇవ్వకపోవడంతో ఓ దివ్యాంగుడు తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన రామసముద్రం మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయతీ దిగువనల్లప్పగారి పల్లెకు చెందిన ఆర్.నారాయణస్వామి(56)కి తన అన్నలు రమణప్ప, రాజన్న ఏడెకరాల భూమిలో వాటా పంచలేదు. దీంతో విసిగిన నారాయణ స్వామి తన భార్య మంజుల, ఇద్దరి పిల్లలను తీసుకుని బి.కొత్తకోట పరిధిలోని ఆలేటివారిపల్లె వద్ద అత్తగారింటికి వెళ్లిపోయాడు. రెండేళ్ల తరువాత శనివారం రామసముద్రం మండలంలోని దిగువనల్లప్పగారిపల్లెకు వచ్చి అన్నలను ఆస్తిలో వాటా ఇవ్వాలని నిలదీశారు. కుదరదని తెగేసి చెప్పడంతో తీవ్ర మనస్తాపం చెందిన బాధితుడు ఇంటి వద్దే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు మదనపల్లెకు తరలించగా డాక్టర్లు మెరుగైన వైద్యం అందించినప్పటికీ నారాయణస్వామి మృతి చెందాడు. అన్నదమ్ముల మోసం కారణంగానే తన భర్త చనిపోయాడని భార్య మంజులమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు


నుజ్జునుజ్జు అయిన కారు


ప్రమాదంలో కాలు విరిగిన శివ

పుల్లంపేట : కడప–చెన్నై జాతీయ రహదారిలోని పుల్లంపేట బైపాస్ ఎస్వీ కళ్యాణ మండపం నందు ట్యాంకర్‌ను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్ర లాతూర్‌కు చెందిన విశ్వనాథ్ చంద్రకాంత్, సంతోష్ రఘురాం, సూర్యవంశీ హనుమంతరావు, దేశ్‌ముఖ్ లాలా సాహెబ్, శీలాలు తిరుమలకు ప్రయాణిస్తుండగా తిరుపతి నుంచి కడపకు వెళ్తున్న ట్యాంకర్ కారును ఢీకొంది. ముగ్గురికి స్వల్ప గాయాలవగా, 108 ద్వారా రాజంపేట ఆసుపత్రికి తరలించారు. అలాగే గాదెల గ్రామానికి చెందిన శివ అనే వ్యక్తి రాజంపేటకు వెళ్తుండగా పుత్తనవారిపల్లి సమీపాన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కుడికాలు విరిగింది. 108 ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రఘురాం తెలిపారు.

ప్రమాదంలో ఇద్దరి ప్రాణాలు పణం

- ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీ
- మహిళ, ఆమె మరిది కుమారుడు మృతి
- కుమారుడికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో మరణించిన కాత్యాయని


మరణించిన రేవంత్

చెన్నూరు : కడప– కర్నూలు జాతీయ చెన్నూరు పాత టోల్‌గేట్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బద్వేల్‌కు చెందిన ఓ మహిళ, ఆమె మరిది కుమారుడు అక్కడిక్కడే మృతి చెందారు. ఆమె కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్నూలు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు కడప–కర్నూలు జాతీయ రహదారిపై ఇర్కాన్ సర్కిల్ సమీపంలో పాత టోల్ గేట్ వద్దకు వస్తోంది. బద్వేల్‌కు చెందిన కాత్యాయని, ఆమె మరిది కుమారుడు, కన్న కుమారుడు స్కూటీలో వెళ్తున్నారు. పాత టోల్ గేట్ వద్దకు చేరగానే ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో గాయాలైన జిక్కా రెడ్డి కాత్యాయని(36), ఆమె మరిది కుమారుడు రేవంత్(13) సంఘటన స్థలంలోనే మృతి చెందారు. కాత్యాయని కుమారుడు నవీన్‌కుమార్‌కు తీవ్ర గాయాలవడంతో కడప రిమ్స్‌కు తరలించారు. మృతులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, మృతురాలి భర్త మేదిరెడ్డి హనుమంతు హైదరాబాద్‌లో ఉన్నారని తెలియవచ్చింది. ఇదిలా ఉండగా మృతులు బద్వేల్ నుంచి ఏ పనిపై వచ్చారో తెలియ రావడంలేదని పోలీసులు తెలిపారు. మృత దేహాలను కడప రిమ్స్ కు తరలించి ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎంపీజే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా జాగృతి ఉద్యమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టాన్ని సక్రమంగా అమలుచేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యారంగ పాలసీ వెనక్కు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని, విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుని పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఖాళీగా ఉన్న 43,355 పోస్టులకు గానూ, ప్రభుత్వం 16,347 పోస్టులు మాత్రమే భర్తీ చేయనుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన స్టూడెంట్స్ కిట్స్ అందించాలని, అవకతవకలు జరిగిన నీట్ పరీక్ష రద్దు చేసి తిరిగి పరీక్షలు నిర్వహించాలని కోరారు. నూతన జూనియర్, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, ప్రైవేటు కార్పొరేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చేపట్టి తల్లిదండ్రులపై ఫీజుల భారం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే పట్టణాధ్యక్షుడు హుసేన్‌బాషా, ఉపాధ్యక్షుడు నజీర్ అహ్మద్, మహ్మద్ అస్లాం పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం వద్దు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్తు సంస్థలో రాజకీయ జోక్యం నివారించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి అన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ జోక్యంతో విద్యుత్తు ఉద్యోగుల బదిలీలు జరిగాయన్నారు. డిస్కం ప్రెసిడెంట్ ఎస్.శివశంకర్ మాట్లాడుతూ సర్వీస్ రెగ్యులేషన్స్ ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు


బైక్ నుంచి జారి పడి తీవ్రంగా గాయపడిన మల్లీశ్వరి


బైక్ బ్రేక్ ఫెయిలై తీవ్రంగా గాయపడిన క్రిష్ణ


బైక్ ప్రమాదంలో గాయపడిన బాలుడు చక్రవర్తి

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన రైతు నారాయణరెడ్డి (60) ఆదివారం చికెన్ కొనడానికి మదనపల్లె మండలం ములకలదిన్నె క్రాస్‌కు వచ్చారు. చికెన్ తీసుకుని రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో నారాయణరెడ్డి తీవ్రంగా గాయపడగా తిరుపతి ఆస్పత్రికి రెఫర్ చేశారు. అదే విధంగా కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ గొల్లపల్లికి చెందిన రెడ్డప్ప భార్య బి.మల్లీశ్వరి(45) తన బంధువైన మల్లయ్యతో కలిసి ద్విచక్ర వాహనంలో ముదివేడు సంతకు వస్తుండగా మార్గమధ్యంలోని దండుమారెమ్మ గుడి వద్ద బైక్‌పై నుంచి జారి కిందపడింది. ప్రమాదంలో తలకు తీవ్రగాయమవడంతో గమనించిన స్థానికులు వెంటనే మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పలమనేరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు ఎం.క్రిష్ణ (35) తన ఇద్దరు కొడుకులు జగదీష్ (10), చక్రవర్తి (8)తో కలిసి ద్విచక్ర వాహనంలో ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండకు వచ్చారు. దైవ దర్శనానంతరం తిరిగి కొండపై నుంచి ద్విచక్ర వాహనంలో వస్తుండగా బ్రేక్ ఫెయిల్ కావడంతో బైక్‌తో సహా కిందపడ్డారు. ప్రమాదంలో క్రిష్ణకు కాలు విరగగా, జగదీష్, చక్రవర్తి గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం క్రిష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి ఆస్పత్రికి తరలించారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ: వ్యక్తి మృతి


రామచంద్రయ్య(ఫైల్)

మైదుకూరు : మైదుకూరు పట్టణ శివారులో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్‌లో వస్తున్న మైదుకూరుకు చెందిన విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి రామచంద్రయ్య (58) మృతి చెందారు. కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారి బైపాస్ పై రాత్రి ద్విచక్రవాహనంలో వస్తున్న రామచంద్రయ్యను ఎదురుగా వస్తున్న వాహనం ఢీ కొట్టి ఆపకుండా వెళ్లినట్టు తెలుస్తోంది . సంఘటనలో తలకు తీవ్ర రక్త గాయాలు కావడంతో రామచంద్రయ్యను చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మైదుకూరులో నంది కళాశాల, భారతి బాలికల జూనియర్ కళాశాల, అవధూత కొండయ్య స్వామి డిగ్రీ కళాశాల ను రామచంద్రయ్య నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామచంద్రయ్య మృతి పట్ల పట్టణంలోని విద్యాసంస్థల యజమానులు సంతాపం తెలిపారు.

డీఎస్సీకి ముందు టెట్ నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : మెగా డీఎస్సీ నిర్వహణకు ముందే టెట్ నిర్వహించాలని ఎస్టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తక్కువ పోస్టులు ప్రకటించడంతో టెట్‌కు చాలామంది హాజరు కాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అత్యధిక పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించడంతో మరోసారి టెట్ నిర్వహించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ విద్యా రంగానికి వినాశనంగా మారిన జీవో 117ను రద్దు చేయాలని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. 12వ పీఆర్‌సీ అమలయ్యేలోగా మెరుగైన మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. తుపాకుల మురళి, ఆవుల శ్రీనివాసులు, రామచంద్ర, ఆలమూరు ప్రసాద్ పాల్గొన్నారు.

నియంత్రాల ప్రయోగం.. నిమ్మతో ఆదాయం

పాత పద్ధతులకు స్వస్తి పలికి నిమ్మ సాగులో కొత్త ఒరవడికి శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారు. నిమ్మ పంట సాగు చేసి నియంత్రాల విధానం ఉపయోగించి లాభాల బాట పడుతున్నారు. సాధారణ దిగుబడుల కంటే అధికంగా దిగుబడి రావడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

- రైతుకు అండగా కేవీకే శాస్త్రవేత్తల ఆలోచన
- నూతన విధానంపై మిగిలిన రైతుల ఆసక్తి


రైతు సుమన్ కుమార్ సాధించిన నిమ్మ దిగుబడి


నిమ్మ తోటలో కాసిన కాయలు

మైదుకూరు : మైదుకూరు పట్టణానికి చెందిన రైతు చిట్టిబోయిన సుమన్‌కుమార్ మండలంలోని తువ్వపల్లె వద్ద తన 5.5 ఎకరాల పొలంలో నిమ్మ తోట సాగుచేశారు. ఎరువులు వేసినా, పురుగు మందు పిచికారీ చేసినా చీడపీడలతో సక్రమంగా ఎదగక దెబ్బతింది. దీంతో ఆ రైతు వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను ఆశ్రయించారు. రెండేళ్ల కిందట నిమ్మ సాగులో సలహాలు, సూచనలు తెలుసుకుని కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.బాలకృష్ణ డాక్టర్ బీఎస్ కాంతిశ్రీల సలహాల మేరకు భిన్నంగా ఆలోచించారు. పూత, పిందె దశలో నియంత్రాల విధానంలో జిబ్బరెల్లిక్ ఆమ్లం, పొటాషియం నైట్రేట్, సైకోసెల్ మందులు పిచికారీ చేశారు. మొక్క పెరుగుదల నియంత్రకాలైన జిబ్బరెల్లిక్ ఆమ్లం గ్రాము లీటరు నీటికి కలిపి ఆగస్టులో పిచికారీ చేయించారు. దీంతోపాటు రెండు మిల్లీలీటర్ల సైకోసిల్ లీటర్ నీటికి కలిపి అక్టోబరులో పిచికారీ చేయించారు. నియంత్రాల విధానంతో ఆశించిన దానికంటే ఎక్కువ మోతాదులో పూత రావడం గమనించారు. ఎక్కువ పిందెలు రాలడం, కాయల పరిమాణం బాగా పెరగడంతో రైతుకు ఎకరాకు పది టన్నుల దిగుబడి వచ్చింది. తాము ప్రయోగాత్మకంగా చేసిన విధానంతోనే అధిక దిగుబడి సాధ్యమైందని కేవీకే శాస్త్రవేత్తలు అన్నారు.

నియంత్రాల విధానంతో దిగుబడులు



తువ్వపల్లె వద్ద రైతు సుమన్ కుమార్ తన పొలంలో సాగు చేసిన నిమ్మ పంటలో నియంత్రాల విధానం అనుసరించారు. అధిక దిగుబడి సాధించగలిగారు. నిమ్మ సాగులో ఇది ప్రథమ శ్రేణి ప్రదర్శన కావడం , సుమన్ కుమార్‌కు అధిక దిగుబడి రావడం చూశాం. మంచి ఆదాయం రావడంతో మిగిలిన రైతులు ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు.

\- డాక్టర్ ఎం.బాలకృష్ణ, సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి, కేవీకే వనిపెంట

మొక్కల పెరుగుదలపై దృష్టి



రైతు సుమన్ కుమార్ సాగు చేసిన నిమ్మ మొక్క పెరుగుదలపై దృష్టి సారించాం. మొక్క పెరుగుదలకు దోహదపడే జిబ్బరెల్లిక్ ఆమ్లం, పొటాషియం నైట్రేట్, సైకోసిల్ మందులు నెల విడిచి నెల పిచికారీ చేయించాం. ఈ మందులు మొక్క శాఖల పెరుగుదలను బాగా పెంచాయి. సైకోసిల్ పూత నిలబడేందుకు, పిందె పరిమాణం పెరగడానికి ఉపయోగపడ్డాయి.

\- డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్, ఉద్యాన శాస్త్రవేత్త, కేవీకే వనిపెంట

ఆదాయాన్ని ఇచ్చిన ప్రయోగం



నేను సాగు చేసిన నిమ్మ పంట ఎదుగుబొదుగు లేకుండా ఉండడతో కేవీకే శాస్త్రవేత్తలను కలిశాను. వారు చేసిన ప్రయోగంతో నిమ్మ పంటలో అధిక దిగుబడి వచ్చి నాకు ఆదాయాన్ని ఇచ్చింది. కేవీకే శాస్త్రవేత్తల సలహాలతో ఆదాయం సాధించాను. అందరు రైతులు ఈ విధానం అనుసరించి నిమ్మసాగులో దిగుబడులు పెంచుకోవచ్చు.

\- సుమన్ కుమార్, రైతు, మైదుకూరు